శ్రీ

శ్రీమతే రామానుజాయనమః

# గద్యత్రయ ప్రబంధము

(ఆంధ్రీకరణము)

రచన

కె. రామానుజ భట్టర్

హన్మకొండ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2016

# GADYATRAYA PRABANDHAM

**(ANDRIKARANAM)**

*By*
**K. Ramanuja Bhattar**

T.T.D. Religious Publications Series No. 1191
© All Rights Reserved

*First Edition : 2016*

*Copies :* 2000

*Published by*
**Dr.D.SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

Office of the Editor-in-Chief
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

# ముందుమాట

భారతావనిలో సనాతన సంప్రదాయాన్ని సుస్థిరంచేసి ప్రాచుర్యం కావించటంలో త్రిమతాచార్యులస్థానం సముచితమైనది, సమున్నతమైనది. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మతస్థాపనాచార్యులు శంకర, రామానుజ, మధ్వాచార్యులు. శంకరభగవత్పాదులవారిది బ్రహ్మ సంప్రదాయం, భగవద్రామానుజులవారిది శ్రీసంప్రదాయం, మధ్వాచార్యులవారిది ఏకాయన సంప్రదాయం. ఈ మూడింటిలోనూ 'శరణాగతి' సంప్రదాయం ఉంది.

శ్రీరామానుజులవారి విద్వత్తు, భక్తి, ప్రపత్తి త్రివేణీ సంగమంలా శ్రీభాష్య, గీతాభాష్య, గద్యత్రయాదిక రచనలలో దర్శనమిస్తుంది. రామానుజ'వాణి'కి గద్యత్రయం రత్నకిరీటం. గద్యత్రయంలోని అక్షరాక్షరాలలో రహస్యవేదాంతప్రస్థానం గర్భితం. ఇది వేదాంత రహస్య విషయాలు కలిగిన మూడు ప్రబంధాల సంపుటి. రామానుజులవారు భక్తిరస ప్రవాహరూపంగా గద్యత్రయాన్ని ఆశువుగా చెప్పారని పూర్వాచార్యుల కథనం. గద్యవాఙ్మయంలోని ప్రార్థనాగద్యలలో గద్యత్రయంలోని శ్రీశరణాగతిగద్య, శ్రీరంగగద్య, శ్రీవైకుంఠగద్య అనర్ఘ రత్నాలు. గద్యత్రయాన్ని భావయుక్తంగా అర్థంచేసుకుంటే మనోవికారాలు తొలగి భగవదనుగ్రహప్రాప్తికి ప్రవేశార్హత (ఎంట్రెన్స్ క్వాలిఫికేషన్) లాంటిది.

గద్యత్రయంలోని శ్రీశరణాగతిగద్యను ప్రాతఃకాలపూజా సమయాన, శ్రీరంగగద్యను మాధ్యాహ్నిక పూజాసమయాన, శ్రీవైకుంఠగద్యమును రాత్రి శయన సమయాన పఠించాలని పురాతన సంప్రదాయం.

ఆరాధనలో స్వామివారి గుణసౌందర్యాలను దాసులైన భక్తులకు ఎలా ఆత్మీయార్పణచేయాలో తెలిపేది 'శరణాగతిగద్యం'. ఈ గద్యం ఒకరకంగా ద్వయమంత్రానికి వ్యాఖ్యానరూపంగా ఉందని పెద్దలమాట. శ్రీదేవిని మొదట ఆశ్రయించి ఆ తర్వాత శ్రీమన్నారాయణుని ఆశ్రయించాలనీ, ఆమె

పురుషకారం (రెకమెండేషన్) వల్ల శీఘ్రంగా భగవదనుగ్రహం కలుగుతుందని పూర్వాచార్యుల మాట.

శ్రీరంగనాథులవారి దివ్యసౌందర్యాన్ని, కల్యాణగుణగణాలనూ సాక్షాత్కరింపజేసి, ఆవిష్కరించేది 'శ్రీరంగగద్యం'.

శ్రీవైకుంఠ దివ్యలోకం అచటి వైకుంఠనాథుని వైభవం సంపూర్ణంగా ఎరిగినవారు ఆదిశేషులవారు. ఆదిశేషాంశసంభవులు రామానుజులవారు కావడం గమనార్హం. శ్రీవైకుంఠ దర్శనంవల్ల కలిగే దివ్యానుభూతి 'శ్రీవైకుంఠగద్య' పఠనం వల్ల కలుగుతుంది. వైకుంఠగద్యాన్ని విన్నా చదివినా వైకుంఠాన్ని దర్శిస్తూ చేసిన గచ్ఛద్వ్యాఖ్యగా (రన్నింగ్ కామెంటరీగా) ఉంటుంది. ఇదొక పరమదివ్యయాత్రాదర్శిని (స్పిరిచువల్ టూరిస్ట్ గైడ్) అనిపిస్తుంది.

గద్యత్రయప్రబంధం దీర్ఘసమాసభూయిష్ఠంగా, గంభీరార్థ పదాలతో ఉంటుంది. అలాంటి ప్రబంధత్రయాన్ని శ్రీమాన్ కె.రామానుజభట్టర్‌వారు సులభసుందరమైన సంప్రదాయ పద్ధతిలో వివరణాత్మకంగా ఆంధ్రీకరించారు.

సంప్రదాయ గ్రంథాలను భావయుక్తంగా ప్రచురించి సకల జనాలలో ధార్మికభావాలను పారమార్థికరక్తిని, భక్తిని కలుగజేసే ప్రయత్నంలో – శ్రీస్వామివారి అనుగ్రహశక్తితో అనేక ధార్మిక గ్రంథాలను ప్రచురిస్తున్నాము. అందులో భాగంగా భక్తజనులకు ఉపయోగపడే 'గద్యత్రయ ప్రబంధము ఆంధ్రీకరణము' అనే ప్రస్తుత గ్రంథాన్ని ప్రచురించాము. ఈ గ్రంథాన్ని విశేషంగా ఆదరిస్తారని ఆశిస్తూ–

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

శ్రీమతేరామానుజాయనమః

## -వినతి-

# గద్యత్రయ ఆంధ్రీకరణము

శ్రీ భగద్రామానూజుల గద్యత్రయ ప్రబంధాన్ని ఆంధ్రీకరించవలెనని 2008లోనే ఆలోచన వచ్చింది. అప్పుడే ప్రారంభించాను. కాని ఏకాగ్రత నిలుపలేక పెద్ద పెద్ద సమాసములలో ఆ గద్యము ఉండడం వలన, దానిని ఏ విధంగా అనువదించాలో అనే ఆలోచనలో పడిపోయాను. నాకు అంత సంస్కృతజ్ఞానం, సంప్రదాయ పరిజ్ఞానం లేకపోవటం కూడ ఇలాంటి ఆలోచనకు ఒక కారణం.

గద్యత్రయాన్ని ఎవరైనా మహానుభావులు ఆంధ్రీకరించారేమో కాని నాకు తెలియదు. అసలు ఇలా అనునదించాలని ఆలోచన నాకు రావటానికి ఒక కారణం ఉన్నది.

2008 కంటె ముందే ఒకసారి బెంగళూరులో ఉంటున్న మా కుమారుడు చి॥ క్షీరాభిశయనం అయ్యంగార్, నా గొంతు (స్వరం) వినటానికి ఎప్పుడూ తన దగ్గర ఉండాలి అనే కోరికతో కావచ్చు, "ఏదైనా నీవు చదువునాన్నా, నేను రికార్డు చేసి వీడియో తీస్తాను" అని అన్నాడు – ఏది చదవాలి? అని ఆలోచించి "సరే" అని వాడితో అనినాను. "సుమారు అరగంట ఉండేటట్లు చూడు" అని కూడ "క్షీరం" చెప్పాడు. అందువల్ల "గద్యత్రయం" అపుడే అరగంటలో పూర్తి చేయవచ్చును అని అనుకొని, ఒకటి రెండుసార్లు టైమ్ పెట్టుకొని చదివి, అరగంటకు మించకుండా పఠన వేగాన్ని సరిచేసుకున్నాను.

ఒకనాడు రికార్డు చేశాడు. గద్యత్రయం మూలం చదవటానికే అరగంట పట్టింది. దానిని తన కంప్యూటర్‌లో లోడ్ చేసుకున్నాడు. ఒక సి.డి. తయారు చేశాడు. ఆ సి.డి పెడితే ఎప్పుడైనా వినవచ్చు. చదువుతున్నట్లు ఉన్నా నా ఫోటో చూడవచ్చు. అలా డి.వి.డి డిస్కు తయారుచేసి ఇచ్చాడు.

మేము హనుమకొండలో ఉంటూ ఉంటాము కాబట్టి మేము బెంగుళూరు నుంచి వెళ్లేటప్పుడు ఆ డివిడి డిస్కును కూడ హనుమకొండకు తీసికొని వెళ్లాను. హనుమకొండలో మా కుమారుడు చి॥శార్ఙ్గపాణి అయ్యంగార్ ఉంటున్నాడు.

ఒకనాడు ఆ డివిడిని చూడమని మా కుమారుడికి ఇచ్చాను. మా కోడలు చి॥ల॥సౌ॥కృష్ణవేణి సంప్రదాయ విషయాలపై ఆసక్తికలది. ఇద్దరూ ఆ డిస్కును చూచారు. విన్నారు. కాని అది అంతా సంస్కృతము దీర్ఘ సమాస భూయిష్ఠము. అందుచేత అదివారికి అంతగా అర్థముకాక పోవచ్చును.

ప్రసంగవశాత్తు ఒకనాడు వారితో ఆ డిస్కు విషయం మాట్లాడినాను. "అలా కేవలం సంస్కృతంలో ఉన్న గద్యత్రయ ప్రబంధాన్ని చదువితే ఏమి ప్రయోజనం? అది కూడ చాలా త్వరత్వరగా చదివినావు. దానికి తెలుగులో అర్థం చెప్పుతూ చదువితే బాగుంటుంది. అందరికీ దాని అర్థం తెలుస్తుంది కదా" – అని వారు అన్నారు. నాకు కూడ నిజమే అనిపించింది. ఏ విధంగానైనా, నాకు తెలిసిన రీతిలో, తెలుగులో గద్యత్రయాన్ని అనువాదం చేద్దామని ఆలోచన బలపడింది. ఆ ఆలోచన ఫలితమే 2008లో ప్రారంభించిన నా యీ అనువాద కార్యక్రమం.

గద్యత్రయాన్ని ఎలా ఆంధ్రీకరించాలి అని ఆలోచిస్తూనే 2 సంవత్సరాలు గడచిపోయినాయి. – ఇలా ఉండగా ...

జనవరి 2010లో 'క్షీరం' తమతో పాటు మమ్మల్ని (మా దంపతులను) తన మామగారు  అత్తగార్లకు దక్షిణదేశయాత్రలకు తీసికొని వెళ్లాడు. సుమారు 40 శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలను సందర్శించాము.

ఆ ప్రయాణంలోనే చివరగా "శ్రీరంగం" దివ్యక్షేత్రం వెళ్లాము. శ్రీరంగనాథుణ్ణి సేవించుకొనిన తరువాత అదే ప్రాంగణంలో ఉన్న వివిధ సన్నిధులలో కొన్నిటిని సేవించుకొనినాము. అలా సేవించుకున్న సన్నిధులలో "ఉదయవరుల సన్నిధి" ఒకటి.

అక్కడి ఉడయవరులు సన్నిధిలోని ఉడయవరుల అర్చామూర్తికి ఒక విశేషమున్నది. శ్రీ భగవద్రామానుజులు పరమపదము వేంచేయునప్పుడు తమ శక్తి లోని 1/3వ వంతు శక్తిని ఈ అర్చామూర్తిలో నిక్షిప్తం చేశారు అని సంప్రదాయం. మిగతా 1/3వ వంతు శక్తిని "తిరునారాయణా పురం"లోని అర్చామూర్తిలో, మిగాతా 1/3వ వంతు శక్తిని "తిరుమలై" లోని అర్చామూర్తిలో నిక్షిప్తంచేశారట.

ఉడయవరుల సన్నిధిలో ఆ అర్చామూర్తిని సేవించుకుంటున్నప్పుడు నాకు ఈ విషయం గుర్తుకు వచ్చింది. భగవద్రామానుజులు ఈ మండపంలో ఉండియే 'గద్యత్రయ' ప్రబంధాన్ని రచించి కృపచేశారనికూడా గుర్తుకు వచ్చింది. ఎట్లైనా శ్రమపడి ఆ అపూర్వ గద్యత్రయప్రబంధాన్ని అనువదించాలనే నా కోరిక బలీయమైనది. ఉడయవరులను ప్రార్థించినాను. నా యీ చిన్ని ప్రయత్నాన్ని నిర్విఘ్నంగా కొనసాగించమని వేడుకున్నాను.

ఒకటి రెండురోజుల్లో ఇంటికి అంటే బెంగుళూరుకు వచ్చాము. అప్పుడు ఈ అనువాద కార్యక్రమం ప్రారంభించాను.

పెద్ద పెద్ద సమాసములతో ఉన్న మిశ్రిత వాక్యాలను విడగొట్టుకుంటూ అనువాదం సాధ్యమైనంతవరకు చిన్నచిన్న వాక్యాల్లో ఉండేటట్లు చూచుకుంటూ అనువాదం చేశాను. పెద్ద పెద్ద ఖండాలను (పేరా) సూక్ష్మఖండికలుగా విభజించుకొని, గద్యత్రయమూల భాగమును వ్రాయుచు, దాని క్రిందనే అనువాదము వ్రాయుచూ పూర్తిచేశాను.

అనువాదాలు అనేక రకాలుగా ఉంటాయి. నా యీ అనువాదం ఏ ఒక్క అనువాద రీతి కాదు. అవసరం అనుకున్న రీతిలో మార్చుకుంటూ ఒక్కొక్కచోట శబ్దానువాదం, ఒక్కొక్కచోట వాక్యానువాదం, ఒక్కొక్కచోట భావానువాదం, ఒక్కొక్కచోట వివరణ పూర్వకానువాదం – ఇలా వ్రాస్తూ వచ్చాను. నాకు తెలిసినంతలో మూలభావానికి విఘాతం రాకుండా, విఘాతంరాని రీతిలో, చూచుకున్నాను.

ఒక అజ్ఞుడను అయిన నేను, కేవలము ఉడయవరుల కృపాకటాక్షాన్నే ఊతగా తీసికొని రూపొందిచిన ఈ అనువాదం ఎన్నో లోపములతో ఉండవచ్చును. ఈ లోపములు నా అజ్ఞానం వలన కలిగినవే. అనువాదం పూర్తి కావటానికి భగవద్రామానుజుల కృపాకటాక్షమే కారణమని నా దృఢ విశ్వాసం.

అనువాదం చేసే వ్యక్తికి ఆరెండు భాషలలో "పట్టు" ఉండవలెనని భాషాశాస్త్ర నియమం. నాకు ఆ రెండు భాషలైన సంస్కృతము, తెలుగులలో పరిచయము మాత్రమే ఉన్నది కాని "పట్టు" లేదు అయినా సాహసంతో ప్రయత్నించాను. వీలు చేసుకొని దీనిని కూడ వీడియోతీసి, రికార్డు చేయమని "క్షీరం" తో చెప్పాలి.

సంప్రదాయ ప్రవర్తకులు, సంప్రదాయజ్ఞులు, భాషా, శాస్త్రవిదులు, పండితులు నా యీ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తారని, దోషాలను మన్నిస్తారని ప్రార్థిస్తున్నాను.

సామాన్యులకు ఈ అనువాదం వలన ఏమైనా ఉపయోగం కలిగినచో నేను ధన్యుడను అయినట్లు భావిస్తాను.

ఈ "గద్యత్రయం" శరణాగతి మంత్రసారము. శరణాగతి అంటే ఏమిటో క్లుప్తంగానైనా తమకు తెలిసినంత వరకు తెలుసుకొని, భగవానుడైన శ్రీమన్నారాయణునకు, వివిధ ప్రదేశములలో వేంచేసియున్న అర్చామూర్తులకు శరణాగతిచేసి ధన్యులగుదురని కాంక్షిస్తూ సెలవు తీసికుంటున్నాను.

**ఇట్లు**

**భాగవత పాదరేణువు.**

**కోరుకొండభట్టర్, రామానుజభట్టర్**

శ్రీ

శ్రీమతేరామానుజాయనమః

# గద్యత్రయ ప్రబంధము

## 2. శరణాగతి గద్యమ్

శ్లో॥ చిదత్పర తత్త్వానాం
తత్త్వయాధాత్మ్య వేదినే,
రామానుజాయ మునయే
నమో మమ గరీయసే ॥

**మూలము: సంస్కృతము**

1. ఓం భగవన్నారాయణాభిమతానురూప స్వరూప రూప గుణ విభవైశ్వర్య శీలాద్యనవధికాతిశయాసంఖ్యేయ కల్యాణ గుణగణా, పద్మవనాలయాం, భగవతీం, శ్రియం, దేవీం, నిత్యానపాయినీం, నిరవద్యాం, దేవదేవదివ్యమహిషీం, అఖిలజగన్మాతరం, అస్మన్మాతరం, అశరణ్యశరణ్యాం, అనన్యశరణః, శరణమహం ప్రపద్యే-

**అనువాదము: తెలుగు:** (ఈ ఖండికలో అమ్మవారి వర్ణన - శరణాగతి వర్ణించబడినది) ఓ తల్లీ! నీవు అఖిల జగుత్తులకు తల్లివి. జగన్మాతవు. అష్టైశ్వర్య సంపన్నురాలవు. సర్వేశ్వరుని అభిమతమునకు తగినట్లు స్వరూపము, రూపము కలదానవు. విభవము, ఐశ్వర్యము, శీలము మొదలైన అసంఖ్యాక కల్యాణగుణములు కలదానవు. పద్మవనాలయవు. శ్రీ దేవివి. ఎన్నడునూ స్వామిని వీడి ఉండనిదానవు. నిత్యానపాయినివి. స్వామి వక్షః స్థలనివాసినివి. దేవదేవుని దివ్యమహిషివి. పట్టపురాణివి. ఇతరులెవ్వరు శరణమును కోరినవారికి అభయము ఇవ్వకపోయినను, అట్టివారికికూడ నీవు అభయము ఇచ్చుదానవు. శరణు అన్నవారిని రక్షించుదానవు.

అభయమిచ్చుదానవు. అట్టి నిన్ను, అనన్య శరణుడనై (ఇతరులనెవ్వరిని శరణువేడనివాడనై) నిన్నే శరణువేడుకొనుచున్నాను.

**2. మూలము:–** పారమార్థిక భగవచ్చరణారవింద యుగలైకాంతిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తి కృత సంపూర్ణానవరత నిత్య విశదతమానన్య ప్రయోజనానవధికాతిశయ (ప్రయోజన అనవధికాతిశయ) ప్రీతి కారితాశేషా – వస్థోచితాశేష శేషతైకరతిరూప నిత్యకైంకర్య ప్రాప్త్యుపేక్షయా. పారమార్థకీ భగవచ్చరణారవింద శరణాగతిః యథా వస్థితా అవిరతాస్తు–

**అనువాదము:–** (ఈ ఖండికలో కైంకర్యాపేక్షవర్ణనము, అది ఎల్లప్పుడు ఉండవలయుననుట వర్ణింపబడినది)

స్వామీ! నీకు నిత్యకైంకర్యము చేస్తూ ఉండవలయునని నాకు కోరిక కలిగినది. ఆ కైంకర్యాపేక్ష. పారమార్థికమైన నీ చరణారవిందయుగళము కై ఏకాంతిక మైన పరభక్తి పరజ్ఞాన పరమభక్తితో కలిగిన ప్రీతితో కూడినది. అట్టి ప్రీతిచేత సంపూర్ణమైనది. ఎల్లప్పుడు నిత్యమైనది. ఎంతో విశదతమమైనది. అన్య ప్రయోజనము ఏమాత్రము లేనిది. హద్దులేనిది. అట్టి అతిశయప్రీతి ఎల్లవేళలా ఉండునదే. అన్ని స్థితులకు తగినట్లు శేషత్వమే ప్రధానముగా కలది. అట్టి కైంకర్యము చేయవలయునని నాకు అపేక్ష కలిగినది. నిన్ను శరణము అనుచున్నాను. నీకు శరణాగతుడను అగుచున్నాను. ఇట్టి కైంకర్యాపేక్ష నాకు ఎల్లవేళలా ఉండునట్లు అనుగ్రహించుము స్వామీ!

**3. మూలము:–** అస్తు తే – తయైవ సర్వం సంపత్స్యతే.

**అనువాదము:–** (ఈ సూక్ష్మఖండికలో స్వామివారి అభయప్రదాన వర్ణనము)

2వ ఖండికలో శ్రీమద్రామానుజులు ప్రార్థింపగా స్వామివారు “నీకు అట్లే అగుగాక” అని అభయమిచ్చి, “దాని వలననే అనగా అట్టి శరణాగతి వలననే సర్వము సిద్ధించును”. అనికూడ స్వామి అభయమిచ్చినాడు.

**4 మూలము:–** అఖిల హేయ ప్రత్యనీక కల్యాణైకతాన స్వేతర సమస్త వస్తు విలక్షణానంత జ్ఞానానందైక స్వరూప;

**అనువాదము:–** (ఈ ఖండికలో స్వామివారి స్వరూపవర్ణనము)

శ్రీమన్నారాయణ! నీవు ఏ మాత్రము హేయగుణములులేని వాడవు. (సర్వేశ్వరుడు "నిర్గుణుడు" అను నిర్గుణ వాదులు, ఇచట గమనింపదగిన విషయము నిర్గుణుడు అనగా హేయగుణములు లేనివాడు – అను విషయమును గుర్తించవలెను) అనంతమైన కల్యాణ గుణములకు స్థానమైనవాడవు. ఇతరమైన సమస్త వస్తువుల కంటె భిన్నమైన విలక్షణుడవు. జ్ఞానానందములు మాత్రమే నీ స్వరూపము. నీవు జ్ఞానానందైక స్వరూపుడవు.

**5 మూలము:–** స్వాభిమతాను రూపైక రూపాచింత్య దివ్యాద్భుత నిత్య నిరవద్య నిరతిశయ జాజ్జ్వల్య సౌందర్య సౌగంధ్య సౌకుమార్య లావణ్య యౌవనాద్యనంత గుణనిధి దివ్యరూప;

**అనువాదము:–** (ఈ ఖండికలో స్వామివారి దివ్యరూపవర్ణనము)

స్వామీ! నీ దివ్యరూపము, నీకు ఇష్టమైన రీతిలో, నీ అభిమతమునకు తగినట్లు ఉండును. ఆరూపము ఇట్లుండునని చెప్పుటకు కూడ వీలుకానిది. అట్టి అద్భుతమైన రూపము. అది నిత్యమైనది. ఏ కొరతలేనిది. ఎంతో అధిక తమమైన జాజ్జ్వల్యము (కాంతి), సౌందర్యము (అందము) సౌగంధ్యము (పరిమళము), సౌకుమార్యము (మృదుత్వము), లావణ్యము (నవనవోన్మే షత్వము) యౌవనము (పడుచుదనము) మొదలైన అనంత గుణములకు నీవు నిధివే. అనగా తరగని గుణములు కలవాడవు. అట్టి దివ్యరూపము స్వామీ నీది!

**6. మూలము:–**స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజః సౌశీల్య వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సౌమ్య కారుణ్య మాధుర్య గాంభీర్య ఔదార్యస్థైర్య ధైర్య పరాక్రమ;

**అనువాదము:-** (ఈ ఖండికలో స్వామి గుణవర్ణన).

నీ కల్యాణగుణములు ఎన్నతరమా స్వామీ! జ్ఞానము, బలము, ఐశ్వర్యము, శక్తి, తేజస్సు, సౌశీల్యము, వాత్సల్యము, మార్దవము (మృదుత్వము) ఆర్జవము, సౌహార్దము, సౌమ్యము, కారుణ్యము, మాధుర్యము, గాంభీర్యము, ఔదార్యము, స్థైర్యము, ధైర్యము, శౌర్యము మొదలైన గుణములు కలిగి ఉండి నీవు ఎంతో ప్రరాక్రమశాలివి స్వామీ! ఇట్లే నీ గుణములు అసంఖ్యాకములు, సీమారహితములు, స్వాభావికములు.

**7. మూలము:-** సత్యకామ, సత్యసంకల్ప, కృతిత్వ కృతజ్ఞతాద్యసంఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవః

**అనువాదము:** (ఈ ఖండికలో కూడ స్వామి గుణవర్ణనమే)

స్వామీ! నీవు సత్యకాముడవు. సత్యసంకల్పుడవు. సత్య స్వరూపుడవు. నీవే సృష్టి కర్తవు. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధమూర్తులు నీ వలన స్వీకరించిన వివిధ సృష్టి కర్తృత్వ భారములను ఎట్లు నిర్వహించు చున్నారో తెలిసిన వాడవు నీవు స్వామీ! అట్టి అసంఖ్యేయమైన కల్యాణ గుణములకు అవధి, అంతము లేని గంభీర సముద్రము వంటి వాడవు. నీవు పరవాసుదేవుడవు స్వామీ!

**8. మూలము:-** స్వోచిత వివిధ విచిత్రానంతాశ్చర్య, నిత్య, నిరవద్య నిరతిశయానంద, నిరతిశయ సుఖస్పర్శ, నిరతిశయ జాజ్జ్వల్య కిరీట మకుట చూడావతంసమకరకుండల గ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్తాదామోదర బంధన పీతాంబర కాంచీగుణ నూపురాద్యపరిమిత దివ్యభూషణః

**అనువాదము:-** (ఈ ఖండికలో స్వామి దివ్య భూషణవర్ణనము)

నీకు తగినట్లు నీదివ్య భూషణములు కూడ ఉన్నవి. ఆహా ఏమి వాటి సౌందర్యము! ఎంత విచిత్రముగా ఉన్నవి! ఎంత ఆశ్చర్యకరముగా ఉన్నవి!

ఆ నీ దివ్య భూషణములన్నియు నిత్యమైనవే - నిరవద్యమైనవే (ఇతరములతో పోల్చుటకు వీలులేనివే). నిరతిశయమైన ఆనందమును కలిగించునవే. ఆ దివ్యభూషణ స్పర్శ నీకు నిరతిశయమైన సుఖమును కలిగించుచున్నది. ఆహా! ఎంత ప్రకాశవంతముగా ఉన్నవి! ఆ కిరీటము, దానిలో పొదుగబడిన ఆ చూడామణి, ఆ మకర కుండలములు, ఆ కంఠహారములు, ఆ కేయూర కటకములు (బాహువుల ఆభరణములు), వక్షఃస్థలముపై విరాజిల్లుచున్న ఆ శ్రీవత్సచిహ్నము, దానికే అలంకారప్రాయమైన ఆ కౌస్తుభమణి, ముత్యాలతో నిర్మింపబడి అలంకరింపబడిన ఆ దివ్యాభరణము నీ దామోదరమును కప్పివేయు చున్నదయ్యా, దానిపై పీతాంబరమును ధరించినావుకదా! ఆహా ఏమి సౌందర్యము! నీ మొలత్రాడు (కాంచీగుణము) యొక్క అందము, నీ పాదములకుగల ఆ నూపురసౌందర్యము చెప్పనలవియేకాదు స్వామీ!

(ఇచ్చట పాఠకులు గమనింపవలసిన విశేషము:- ఈ ఖండికలో స్వామివారి కిరీటము మొదలు కొని, నూపురముల వరకు గల దివ్యాభరణ సంపద వర్ణింపబడినది - ఆ మూర్తిని ఒకసారి మానసిక చక్షువుతో దర్శించినచో, నీలమేఘశ్యాముని వివిధ వర్ణముల ఆభరణములు, పీతాంబరము, ఆస్వామి సౌందర్యమును ఇనుమడింప చేయుచున్నవా అని అనిపించును. లేదా స్వామి సౌందర్యము ఆ యా ఆభరణముల అందమును ఇనుమడింపచేయుచున్నవా అనిపించును. శ్రీ భగవద్రామానుజులు ఇట్టి అనుభూతిని పొందియే ఇంత వివరముగా, విశదతమముగా వర్ణించినారు అని అనిపించుచున్నది.)

**9 మూలము:-** స్వానురూపాచింత్య శక్తి శంఖచక్ర గదాసిశార్‌ఙ్గాది అసంఖ్యేయ నిత్యనిరవద్యనిరతిశయ కల్యాణదివ్యాయుధ!..

**అనువాదము:-** (ఈ ఖండికలో స్వామివారి దివ్యాయుధములను వర్ణించుచున్నారు) స్వామీ! నీకు అట్టి దివ్యాభరణములేకాదు, నీకు తగినట్టి దివ్యాయుధములను కూడ నీవు ధరించుచున్నావు. వాటిశక్తి ఊహింపనలవి

కానిది. అట్టి శక్తివంతమైన శంఖము (పాంచజన్యము) చక్రము (సుదర్శనము); గద (కౌమోదకి); అసి (ఖడ్గము); (నందకము అనుఖడ్గము); శార్జ్గము (శార్జ్గము అను పేరు కల ధనుస్సు); మొదలైన అసంఖ్యాకమైన దివ్యాయుధములు ధరించిన స్వామీ! ఆ నీ యొక్క దివ్యాయుధములు నిత్యమైనవి. నిరవద్యమైనవి. నిరతిశయమైనవి. కల్యాణకరమైనవి. (నిత్య, నిరవద్య, నిరతిశయ శబ్దములకు వివరణ ఇంతకు పూర్వమే వ్రాసినాను).

**10. మూలము:–** స్వాభిమత నిత్యనిరవద్యానురూప స్వరూప రూప గుణ విభవైశ్వర్య శీలాద్యనవధి కాతిశయ కల్యాణగుణగణ శ్రీవల్లభ!

**అనువాదము:–** (ఈ ఖండికలో స్వామి కల్యాణ గుణవర్ణము)

ఓ లక్ష్మీపతీ! నీకు ఇష్టమైన రీతిలో, నీ కల్యాణగుణములు అసంఖ్యాకములుగ ఉన్నవి. అవి నిత్య నిరవద్యములు. నీకు తగిన స్వరూప, రూప, గుణములు, విభవము, ఐశ్వర్యము, శీలము మొదలైనవే ఆ గుణములు – ఆగుణములచే నిత్యము ప్రకాశించుచుండువాడవు స్వామీ!

**11 మూలము:–** ఏవంభూత శ్రీభూనీలా నాయక!

**అనువాదము:–** (ఈ ఖండికలో అమ్మవార్ల గుణవర్ణన, మరియు శ్రియః పతినాయకత్వము)

నీకు ఎట్టి గుణములు ఉన్నవో అట్టి గుణములే కలిగియున్న శ్రీదేవి, భూదేవి, నీలాదేవి అను దేవేరులతో నిత్యము కలసియున్న ఓ నాయకా!

**12 మూలము:–** స్వచ్ఛందానువర్తి స్వరూప స్థితి ప్రవృత్తి భేదాశేష శేషతైక రూప నిత్య నిరవద్య నిరతిశయ జ్ఞాన క్రియైశ్వర్యాద్యనంత కల్యాణగుణగణ శేష శేషాశన గరుడప్రముఖ నానావిధానంత పరిజన పరిచారికా పరిచరిత చరణయుగల!

**అనువాదము:–** (ఈ ఖండికలో స్వామివారి పరిచారక గణములను వర్ణించుచున్నారు.)

స్వామీ! శేషుదు, శేషాశనుడైన గరుడుడు మొదలైన అనంత పరిజనులు, పరిచారికా గణములు నీ చరణయుగళ పరిచర్యలు చేయుచున్నారు. ఆ పరిజనులు, పరిచారికా గణములు స్వచ్ఛందముననే నీ పరిచర్యలు చేయుచున్నారు. వారివారి స్వరూపములను అనుసరించి, స్థితులనుఅనుసరించి, ప్రవృత్తులను అనుసరించి, వేరువేరు వారు అయినను, వారు అశేషమైన శేషత్వమే ప్రధానముగా కలవారు. నిత్య, నిరవద్య నిరతిశయ జ్ఞానము కలవారు. క్రియైశ్వర్యాది అనంత కల్యాణగుణములు కలవారు. ఇట్టివారు నీ పరిచారక గణము – పరిజనులు.

**13 మూలము:–** పరమయోగి వాఙ్మనసాపరిచ్ఛేద్య స్వరూప స్వభావ స్వాభిమత వివిధ విచిత్రానంత భోగ్య భోగోపకరణ భోగస్థాన సమృద్ధ అనంతాశ్చర్యానన్త మహా విభవానంత పరిమాణ నిత్య నిరవద్య నిరతిశయ వైకుంఠనాథ!

**అనువాదము:–** (ఈ ఖండికలో వైకుంఠనాథ వర్ణనము చేయుచున్నారు.)

ఓ వైకుంఠనాథ! నీవు పరమయోగుల వాక్కులకు, మనసుకు కూడ అందనివాడవు. అనగా నీగుణములు వారు కూడ నుతించలేనన్ని ఉన్నవి. వారు మనసుచేత కూడ నిన్నుఊహించలేరు – అట్టి అపరిచ్ఛేద్యమైనది నీ స్వరూపము. నీ స్వభావము కూడ అట్టిదే. నీకు ఇష్టమైన పద్ధతిలోనే వివిధ విచిత్రములైన అసంఖ్యాకములైన భోగ్యస్థానములు కలవాడవు. భోగోపకరణములు కూడ అసంఖ్యాకములు గానే కలవాడవు. నీ వైకుంఠము అనంతమైనది. అచ్చట విభూతులన్నియు అనంతములే. ఆశ్చర్యకరములే. అనంతపరిమాణములు కలవియే. అట్టి శ్రీ వైకుంఠమునకు స్వామివైన ప్రభూ!

**14 మూలము:–** స్వరూప స్థితి ప్రవృత్తి స్వశేషతైక స్వభావ ప్రకృతి పురుషాత్మక వివిధ విచిత్రానంత భోగ్య భోక్తృవర్గ భోగోపకరణ భోగస్థాన రూప నిఖిల జగదుదయ విభవలయ లీల!

**అనువాదము:–** (ఈ ఖండికలో సృష్ట స్థితి లయలీలను వర్ణించుచున్నారు)

స్వామీ! నీయొక్క సృష్టిస్థితిలయరూపమైనలీల, నీ స్వరూపస్థితి ప్రవృత్తులకు తగినట్లు ఉండును. ప్రకృతి పురుషాత్మకమైన ఆ,నీ,లీల ఎంతో విచిత్రమైనది. శేషత్వమే స్వభావముగా కలది, వివిధమైనది. అనంతమైన భోగ్యరూపమైనది. భోక్తృవర్ణమున్నూ అట్టి అనంతమైనదే. భోగోపకరణములు భోగస్థానములు కూడ అట్టివే. అఖిలజగత్తులను సృష్టించినవాడవు నీవే. వాటిని రక్షించువాడవు నీవే. లయముచెందునట్లు చేయువాడవునూ నీవే. ఇది అంతయు నీ లీల.

**15 మూలము:–** సత్యకామ, సత్యసంకల్ప, పరబ్రహ్మభూత, పురుషోత్తమ, మహా విభూతే, శ్రీమన్నారాయణ, శ్రీవైకుంఠనాథ, అపార కారుణ్య సౌశీల్య వాత్సల్య ఔదార్యఐశ్వర్య సౌందర్య మహోదధే, అనాలోచిత విశేషాశేషలోక శరణ్య, ప్రణతార్తిహర, ఆశ్రిత వాత్సల్యైక జలధే, అనవరతవిదిత నిఖిల భూతజాత యాథాత్మ్య, అశేష చరాచరభూత నిఖిల నియమన నిరత, అశేష చిదచిద్వస్తుశేషిభూత, నిఖల జగదాధార, అఖిల జగత్ స్వామిన్, అస్మత్స్వామిన్ సత్యకామ, సత్యసంకల్ప, సకలేతరవిలక్షణ, అర్థికల్పక, ఆపత్సఖ, శ్రీమన్నారాయణ, అశరణ్యశరణ్య, అనన్యశరణః త్వత్పాదారవింద యుగలం, శరణం అహంప్రపద్యే;....

**అనువాదము:–** (ఈ ఖండికలో భగవద్గుణానుభవమును వర్ణించుచు అట్టి స్వామిని శ్రీభగవద్రామానుజులు శరణువేడుచున్నారు)

స్వామీ! నీవు సత్యకాముడవు. సత్య సంకల్పుడవు. అనగా నీవు సత్యమునే, సత్పదార్థమునే, నిజమైనదానినే కోరుచుండువాడవు. అట్లే కోరవలయునని ఇతరములను కోరవలదని సూచించువాడవు. సత్యమునే నీవు ఎల్లప్పుడు సంకల్పింతువు. నీవు సత్యరూపుడవు కదా! "సత్" పదార్థము నిత్యమైనది. ఎల్లప్పుడు ఉన్నది. అందులకే నీవు దానినే కోరుతూ

(ఆచరించవలెనని కోరుచు) సంకల్పించుచుండు వాడవు. నీవే పరబ్రహ్మావు. అనగా పరవాసుదేవుడవు. వ్యూహవిభవఅంతర్యామి అర్చామూర్తులకు మూలమైనవాడివి. (శ్రీరంగములోని శ్రీరంగనాథుని శ్రీమద్రామానుజులు (ఉడయవరులు, ఎంబెరుమానారు) శరణాగతి చేయుచున్నను. ఆ అర్చామూర్తిని పరబ్రహ్మముగానే పరవాసుదేవునిగానే తలచినారని అర్థము). పురుషోత్తమ, ఉత్తమపురుషా, (అనగా లీలావిభూతిలోను, నిత్యవిభూతిలోనూ గల ఆత్మలన్నియు పరమ పురుషునకు శేషభూతములైనవే, పరతంత్రమైనవే. కాబట్టి వాటిని "పురుషులు" అనరాదు. వాటికి (ఆ ఆత్మలకు). స్వాతంత్ర్యములేదు కదా! సర్వేశ్వరుడే సర్వ స్వతంత్రుడు కనుక అతడే పురుషోత్తముడు అని అర్థము). మహావిభూతే, (స్వామి ఎదుట అన్ని విభూతులు అల్పములే. కనుక స్వామి ఒక్కడే ఉన్నతమైన విభూతి కలవాడని అర్థము). శ్రీమన్నారాయణ! (నారములకు స్థానభూతుడైనవాడు. నారములనగా నిత్యపదార్థములు. శ్రీదేవితో కూడి ఉన్నవాడు. కనుకనే శ్రీమన్నారాయణుడని అర్థము. ఈ "నారాయణ" నామము బ్రహ్మరుద్రేంద్రాదులకు ఎవరికినీ లేదని గుర్తించవలెను) శ్రీవైకుంఠనాథ, (శ్రీవైకుంఠము త్రిపాద్విభూతిలోని నగరము – అమృతమయమైన దివ్యధామము – త్రిపాదస్యామృతందివి – అని కదా – అట్లే దివ్యధామమునకు ప్రభువు); 'అపార' అనగా హద్దులేని కారుణ్య (దయ) సౌశీల్య (సత్స్వభావ) వాత్సల్య (తనవత్సము (దూడపై) ఆవుకు ఉండే ప్రేమను వాత్సల్యము అందురు – అంతటి ప్రేమ జీవుల యెడల ఉండువాడు స్వామి; ఔదార్యము (ఎంతో ఉదారమైన స్వభావము కలవాడు – నిర్హేతుక కృపా కటాక్షమును ప్రసరింపచేయువాడు కదా!) ఐశ్వర్యము, సౌందర్యము అను ఈ గుణములకు మహోదధి వంటి వాడవు స్వామీ! అశేషలోకములను రక్షించుచు అభయ మిచ్చువాడవు. ఇట్లు అభయ మిచ్చుటలో ముందు వెనుకలు ఆలోచించుకొని ఇచ్చుటకాదు – ఏమగునో అనికొంచెము కూడ ఆలోచించకుండా

అభయమిచ్చువాడవు. ఎవరైననూ, ఎట్టివాడైనను, ప్రణతులైనచో అనగా "నమః" అనినచో వారి ఆర్తిని పూర్తిగా తొలగించువాడు. ఆశ్రితులను రక్షించుటలో వాత్సల్య జలధియే. అఖిల చరాచరముల యథార్థస్థితిని (యాథాత్మ్యమును) ఎల్లప్పుడు తెలుసుకొనుచుండువాడు. వారివారి శారీరిక స్థితులనేకాదు, మానసిక భావోద్వేగ స్థితులను కూడ తెలుసుకొను చుండువాడు. తెలిసినవాడు. అశేష చరాచర భూతములను (ప్రకృతిలోని అన్నిటిని) నియమించుటలో ఎల్లప్పుడూ ప్రవర్తించియుండువాడు, అశేషమైన చిదచిత్ వస్తువులకు శేషభూతుడైనవాడు, శేషి అయినవాడు, నిఖిల జగత్తులకు ఆధారమైనవాడు, అఖిల జగత్తులకు స్వామి అయినవాడు, అట్టి అసంఖ్యేయ గుణగణ పరిపూర్ణుడవైన ఓ నాస్వామీ! సత్యకామ, సత్యసంకల్ప, (ఈ శబ్దములను ఉడయవరులు భక్తి పారవశ్యముచే మాటిమాటికి తలచుకొనుచున్నారని తలచవలెనను). ఇతర సమస్త వస్తువుల కంటె విలక్షణమైనవాడా! అర్థించినవారికి (నిన్ను ఏదైనను కోరినచో అట్లు కోరినవారికి) కల్పవృక్షమువంటి వాడవు. (తప్పక వారు కోరినది ఇచ్చువాడవు. కల్పవృక్షము అట్లు ఇచ్చును) ఆపదలో ఉన్నవారికి పరమ మిత్రుడవై ఆదుకొనువాడవు. ఓ శ్రీమన్నారాయణా! నీవు అశరణ్య శరణ్యుడవు. నేనే అనన్య శరణ్యుడను. - అనగా ఎవరినీ శరణుకోరనివాడను. అట్టినేను నీ పాదరవింద యుగళమును (పద్మములవంటి సౌగంధిక, మృదు, మధురమైన నీపాదద్వయమును) నేను శరణువేడుచున్నాను.

**16 మూలము : అత్ర ద్వయమ్ -** ఇచట ద్వయ మంత్రమును అనుసంధించవలెను.

"శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే,
శ్రీమతే నారాయణాయ నమః" - ద్వయ మంత్రము.

**అనువాదము:–** శ్రీమన్నారాయణ చరణయుగళమును శరణువేడుచున్నాను.
శ్రియః పతియైన స్వామివారికి నమస్కరించుచున్నాను.

(ద్వయార్థ వివరణములను పాఠకులు ప్రత్యేకముగ తెలుసు కొనవలెను.)

**17. మూలము:–**

**శ్లో॥ పితరం మాతరం దారాన్, పుత్రాన్, బంధూన్, సఖాన్, గురూన్,**
**రత్నాని, ధనధాన్యాని, క్షేత్రాణిచ గృహాణిచ ॥**

**అనువాదము:–** తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, బంధువులను, స్నేహితులను, గురువులను, రత్నాదులను, ధన ధాన్యములను, భూ గృహములను – వీటినన్నిటిని విడచి నీ శరణుకోరుచున్నాను.

**18. మూలము:–**

**శ్లో॥ సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షిరాన్ ।**
**లోక విశ్రాంతచరణౌ శరణంతే వ్రజం విభో ॥**

**అనువాదము:–** సర్వధర్మములను, సర్వకామములను, విడచి లోక ప్రసిద్ధి చెందిన నీ చరణములను ఆశ్రయించుచున్నాను.

**19. మూలము:–**

**శ్లో॥ త్వమేవ మాతాచ పితా త్వమేవ, త్వమేవబంధుశ్చ గురుస్త్వమేవ ।**
**త్వమేవ విద్యాద్రవిణంత్వమేవ, త్వమేవ సర్వం మమదేవదేవ ॥**

**అనువాదము:–** నీవే తల్లివి, తండ్రివి, బంధువువు, గురువువు, విద్యవు, నీవే నా సర్వస్వము.

**20. మూలము:–**

**శ్లో॥ పితాసి లోకస్య చరాచరస్య, త్వమస్యపూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**నత్వత్సమోఽ భ్యధికఃకుతోఽ న్యో, లోకత్రయేఽ ప్రతిమ ప్రభావ ॥**

**అనువాదము:–** చరాచర ప్రకృతికి తండ్రివినీవే – పూజనీయుడవునీవే. ఎంతో మహిమ గల గురువువునీవే – నీతో సమానమైన వారు ఈ ముల్లోకములలోను, ఎక్కడనూ ఎవరునూ లేరు. నీ కంటె అధికులు ఎవరూ లేరు.

**21. మూలము:–**

**శ్లో॥ తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం, ప్రసాదమే త్వామహ మీశమీడ్యం,**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియా యార్హసి దేవ సోఢుమ్॥**

**అనువాదము:–** అందువలననే నేను నీకు నమస్కరించి నీ అనుగ్రహము కొరకు వేడుకొనుచున్నాను. నీవే నా ప్రభువువు. తండ్రి పుత్రుని భరించునట్లు, స్నేహితుడు స్నేహితుని భరించునట్లు, భార్యను (ప్రియురాలైన భార్యను) భర్త భరించునట్లు నీవు నన్ను భరించుము స్వామీ! భరించ తగిన వాడవు.

**22. మూలము:–** మనో వాక్కాయైః అనాది కాల ప్రవృత్తా నంతా కృత్యకరణ కృత్యాకరణ భగవదపచార భాగవతాపచార సహ్యాపచార అసహ్యాపచార రూప నానావిధ అనంతాపచారాన్ కృతాన్, క్రియ మాణాన్, కరిష్యమాణాంశ్చ సర్వానశేషతః క్షమస్వ.

**అనువాదము:–** (ఈ ఖండికలో తన అపచారములనుక్షమించమని తేరుకొనుచున్నారు.)

స్వామీ! నేను మనో వాక్కాయములచేత అనాది కాలమునుండి ఎన్నో అకృత్యకరణ అపచారములను (చేయకూడని పనులను చేసిన అపరాధములను) కృత్యకరణ అపచారములను (చేయవలసిన పనులను చేయకపోవుట అను అపచారములు (శాస్త్ర విహిత కర్మలను చేయకపోవుట కృత్యాకరణ అపచారములు, శాస్త్ర నిషిద్ధ కర్మలను చేయుట అకృత్య కరణ అపచారములు) – ఇట్టి అపచారములను, భగవదపచారములను (భగవంతుడే లేడని అనుట లేదా భగవంతునకు ఇష్టము లేని పనులుచేయుట), భాగవతా

పచారములను (భగవద్భక్తుల విషయములో చేసిన అపచారములను), సహ్యాపచారములను, అసహ్యాపచారములను – (భగవంతుని విషయములో చేసిన అపచారములను సహ్యాపచారములు అందురు. భాగవతుల విషయములో చేసిన అపచారములను అసహ్యాపచారములు అందురు. ఎందుకనగా భగవానుడు తన విషయములో చేసిన అపచారములనైన సహించునే కాని తన భక్తులైన భాగవతుల విషయములో చేసిన అపచారములను సహించడు – దీనినే భగవానుడు "మద్భక్తేషు కదాచన..." అనినాడు కదా!) ఇట్టి అనంతమైన అపచారములను నేను ఎన్నో ఇదివరలో చేసితిని. ఇప్పుడు చేయుచున్నాను. ఇకముందు కూడ చేయుదును. అట్టి అనేక అశేష అపచారములను క్షమించుము స్వామీ!

**23. మూలము:–** అనాదికాల ప్రవృత్త విపరీత జ్ఞానమాత్మవిషయం కృత్స్న జగద్విషయం చ విపరీత వృత్తం చ అశేష విషయం అద్యాపి వర్తమానం వర్తిష్యమాణంచ సర్వం క్షమస్వ.

**అనువాదము:–** (భగవానుని విషయములో కల విపరీత (వ్యతిరేక) జ్ఞాన అపచారమును క్షమించమని ఈ ఖండికలో ప్రార్థించుచున్నారు.)

హే భగవాన్, అనాది కాలమునుండి నాప్రవృత్తి నిన్ను గురించిన విపరీత (వ్యతిరేక) భావమునే కలిగియున్నది. ఆత్మను గురించిన అభిప్రాయము కూడ విపరీతముననే ఉన్నది. అనగా స్వరూపజ్ఞానము వ్యతిరేకముగా ఉన్నది. భగవద్విషయమైన జ్ఞానమంతయు విపరీతముగానే ఉన్నది. ఇట్లు అనాది కాలమునుండి ఉన్నది. అట్టి విపరీత జ్ఞానమును, ఇప్పుడు ఉన్న విపరీత జ్ఞానమును కూడ తొలగించుము స్వామీ! ఇటు వంటి విపరీత జ్ఞానము ఇక ముందు కూడ కలుగ కుండా రక్షించి, వీటినన్నిటిని క్షమించుము స్వామీ!

**24. మూలము:–** మదీయానాది కర్మ ప్రవాహ ప్రవృత్తాం, భగవత్ స్వరూప తిరోధానకరీం విపరీత జ్ఞాన జననీం, స్వవిషయాశ్చ భోగ్యబుద్ధేః జననీం,

దేహేంద్రియత్వేన, భోగ్యత్వేన, సూక్ష్మరూపేణచావస్థితాం, దైవీం గుణమయీాం మాయాం, దాస భూతః, శరణాగతోఽస్మి-తవాస్మి దాస ఇతి వక్తారం మాం తారయ.

**అనువాదము:-** (ఈ ఖండికలో దైవీ మాయను తొలగించమని స్వామిని వేడుచున్నారు)

స్వామీ! నీ మాయ ఎన్నో గుణములు కలది. దీనిని తరించుట ఎవరి తరముకాదు. ఈమాయ అనాది కాలమునుండి నేను చేయుకర్మలను అనుసరించి, నన్ను ఆవరించి యున్నది. ఈ మాయ నీ స్వరూపమునే కనిపించకుండా చేయును. అందుచేతనే నేను నిన్ను గుర్తించలేక పోయితిని. పైగా ఈ మాయ నీ విషయములో నాకు విపరీత జ్ఞానమును (వ్యతిరేక భావమును) కలుగజేయుచున్నది. ఎప్పుడు స్వవిషయములలోనే నేను నిమగ్నుడనై దాచునట్లు చేసి ఆ విషయవాంఛలలో మునిగి తేలునట్లు నన్ను చేయుచున్నది. ఈ కార్యమునకు దేహేంద్రియములు ఆ మాయకు సహాయ పడుచున్నవి. దేహేంద్రియములచే భోగ్యములను అను భవించునట్లు నన్ను చేయుచు సూక్ష్మరూపముగా నాలో చేరి యున్నది. నేనేమి చేయగలను? నేను నీకు దాసుడను కదా! శరణువేడుచున్నాను. ఇట్లు నీవే శరణము అనుచున్న ఈ దాసుని కరుణించి, ఈ మాయాజాలము నుండి తప్పించి, నన్ను ఈ భవసాగరము నుండి తరింపచేయుము స్వామీ!

**25 మూలము:-** (ఈ ఖండికలో, భగవద్గీత శ్లోకముల ద్వారా శ్లోక త్రయోదిత జ్ఞానిగా తనను చేయుమని శ్రీ భగవద్రామానుజులు ప్రార్థించుచున్నారు)

భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు ఇట్లు చెప్పుచున్నాడు-

పార్థా! ఉత్తమ కర్మలు ఒనర్చు భక్తులు నాలుగు విధములుగ ఉంటారు. వారునన్ను భజింతురు. వారు ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువుల, జ్ఞానులు (ప్రేమ భక్తులు) అనువారు. (7-16)

ఇట్లు చెప్పిన పిదపవారిలో ఉత్తముడెవరో చెప్పుచున్నారు.

**1. శ్లో॥ తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిర్విశిష్యతే,**
**ప్రియో హి జ్ఞానినోఽ త్యర్థః అహం, సచమమప్రియః (7-17)**

**అనువాదము:-** ఈ నలుగురిలో శ్రేష్ఠుడు అనన్య భక్తి కలిగి ఉన్న జ్ఞాని ఎందుకనగా అతడు కేవలము నాయందే మనసునిలిపి, చరించుచు, భజించును అందుచేత నేను అతనికి, అతడు నాకు అత్యంతము ప్రియము. (7-17)

**2. శ్లో॥ ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతం**
**ఆస్థితః సహియుక్తాత్మా, మామేవానుత్తమాంగతిం" (7-18)**

**అనువాదము:-** అయితే మిగతా వారు శ్రేష్ఠులు కారని కాదు. వారందరు ఉదారులే. ఆర్తునకు తనదుఃఖము దూరము కావలయునని ఉండును. జిజ్ఞాసువునకు తత్త్వమును తెలుసుకొను ఇచ్ఛకూడ ఉండును. అర్థార్థునకు అర్థమునందే (ద్రవ్యమునందే) కోరిక అధికముగ ఉండును. కాని జ్ఞానియగు భక్తునకు మాత్రము ఏ విధమైన పై గుణములు ఉండవు. అనన్య భక్తి మాత్రమే ఉండును. కావున అతడు ఉత్తమ గతిని పొంది నన్ను చేరును. కావున అతడే ఉత్తమ శ్రేష్ఠుడు.

**3. శ్లో॥ బహూనాం జన్మనాం అంతే, జ్ఞానవాన్ మాం ప్రపద్యతే,**
**వాసుదేవ స్సర్వమితి, సమహాత్మా సుదుర్లభః॥**
**-- ఇతి శ్లోకత్రయోదిత జ్ఞానినం మాం కురుష్వ**

**అనువాదము:-** అనేక జన్మల అంతిమ జన్మమగు మనుష్య జన్మమును పొంది, జ్ఞాని నా శరణుకోరి, సర్వము వాసుదేవుడే అని తలచుచు, భగవద్గుణానుభవమును అనుభవించును. అట్టి మహాత్ముడు చాలా దుర్లభము.

-స్వామీ! నీవు నీ కృపాకటాక్షమును ప్రసరింపచేసి నన్ను ఈ శ్లోకత్రయములో విశదీకరించిన జ్ఞానము కలవానినిగా చేయుము.

**26 మూలము:-** (ఈ ఖండికలో భగవద్గీత శ్లోకములద్వారా స్థానత్రయోదిత పరభక్తి యుక్తునిగా తనను చేయమని ప్రార్థించుచున్నారు)

భగవద్గీతలో శ్రీ కృష్ణభగవానుడు ఇట్లు చెప్పుచున్నారు -

**1.శ్లో॥ పురుషః స పరః పార్థ, భక్త్యాలభ్యస్త్వనన్యయా - (8-22)**

**అనువాదము:-** పార్థా! సంపూర్ణ జగత్తు ఎవని అంతర్గతమైయున్నదో, ఎవనిచేత ఈ జగమంతయు నిండియున్నదో అట్టి పరమ పురుషుడు అనన్య భక్తితో లభ్యమగును - (8-22)

**2. శ్లో॥ భక్త్యా త్వనన్యయా శక్యః - (11-54)**

**అనువాదము:-** చతుర్భుజ రూపములు గలనేను అనన్య భక్తితో మాత్రమే చూడ శక్యమైన వాడను - చూచుటవరకేకాదు మీరు మిక్కిలి, తత్త్వముచే యథార్థమెరుగుటకు, పొందగలుగుటకు కూడ శక్యమైనవాడను - (11-54)

**3. శ్లో॥ మద్భక్తిం లభతే పరాం - (18-54)**

**అనువాదము:-** సాత్వికమైన బుద్ధిసాధకుడు, సాత్విక ధృతి (ధైర్యము) ద్వారా, ఇంద్రియములను, శరీరమును నియంత్రించవలెను. శబ్దాది విషయ భోగానుభవమును వదలవలెను. రాగద్వేషములను, అహంకారమును, బలమును, గర్వమును, కామమును, క్రోధమును, పరిగ్రహమును, మమకారమును, త్యజించవలెను. ప్రాపంచిక సంబంధమును వదలి శాంతయుతుడు కావలెను. మితమైన సాత్విక ఆహారమును స్వీకరించుట, మనసును వాక్కును వశపరచుకొనుట అనునవిపై వాటికి సహాయపడును. ఎల్లప్పుడు భగవత్ధ్యానమందు ఉండవలెను. ఇట్లు క్రమముగా ఎదిగిన సాధకుడు బ్రహ్మప్రాప్తికి పాత్రుడగుచున్నాడు.

ప్రసన్న చిత్తమును కలిగి బ్రహ్మప్రాప్తిని పొందిన సాధకుడు దేనికిని శోకించడు - ఏదియూ కోరడు - అందువలన సకల ప్రాణుల యందు

సమ భావము కలిగి యుండును. అప్పుడు అతనికి నా యొక్క "పరాభక్తి" లభించును. (18-54)

ఇట్లు పరభక్తి లభించిన వెంటనే తత్త్వజ్ఞానము కలుగును. తత్క్షణమే అతడు నాలో ప్రవేశించును. సాయుజ్యమునొందును. (18-55)

-అని ఇట్లు స్థానత్రయములో చెప్పినట్లు (3 స్థానములలో చెప్పినట్లు) నన్ను పరభక్తి యుక్తునిగా చేయుము స్వామీ!

**27. మూలము:-** పరభక్తి, పరజ్ఞాన, పరమ భక్త్యైక్య స్వభావం మాం కురుష్వే -

**అనువాదము:-** (ఈ ఖండికలో ఉత్తమ సాధకునకు లభించు దశలు వర్ణింపబడినవి)

పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తి అను ఈ మూడును స్వభావముగా కలవానినిగా నన్ను చేయుము స్వామీ! (బ్రహ్మప్రాప్తిని పొందిన ఉత్తమ సాధకునకు లభించుదశలు ఇవి).

**28. మూలము:-** పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్య విశదతమమానన్య ప్రయోజన అనవరతాతిశయ ప్రియ భగవదనుభవోఽహం, తథావిధ భగవదనుభవజనిత అనవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోభితాశేషశేషతైకరతిరూప నిత్యకింకరో భవామి.

**అనువాదము:-** (ఈ ఖండికలో శ్రీభగవద్రామానుజులు భగవత్ ప్రీతి కలిగి నిత్య కింకరుడు కావలయునని కోరుచున్నారు)

భగవన్, పరభక్తి, పరజ్ఞాన పరమభక్తి - అనువానిచేత కలిగిన పరిపూర్ణమైనట్టి, అనవరతమైనట్టి, నిత్యవిశదతమము అయినట్టి, అనన్య ప్రయోజనమే లక్ష్యముగాగల అతిశయమైన భగవత్ప్రీత్యనుభావము నేను కలవాడను. అట్టి భగవదనుభవము వలన కలిగిన ప్రీత్యతిశయముచేత, అశేషమైన (పూర్ణమైన) శేషత్వమే ప్రధానమైన నిత్యకైంకర్యపరుడను నేను

కావలయునని కోరుచున్నాను. అట్టి నా కైంకర్యాపేక్షను సఫలము చేయుము స్వామీ!

**29. మూలము:-** (అవతారిక) :- శ్రీభగవద్రామానుజుల ప్రార్థనను విని, సర్వేశ్వరుడు అభయమిచ్చుచున్నారు- (ఈ ఖండిక పెద్దగా ఉన్నది. అందుచేత సూక్ష్మఖండములుగా చేసి వ్రాయుచున్నాను).

ఏవం భూత మత్ కైంకర్య ప్రాప్త్యుపాయతమా, అవక్లుప్త సమస్త వస్తు విహీనోఽపి, అనంత తద్విరోధి పాపాక్రాంతోఽపి, అనంత మదపచార యుక్తోఽపి, అనంత మదీయాపచారయుక్తోఽపి, అనంతా సహ్యాపచార యుక్తోఽపి ఏతత్కార్యకారణభూతానాం విపరీతాహంకార విమూఢాత్మ స్వభావోఽపి, ఏతదుభయ కార్యకారణ భూతానాది విపరీత వాసనా సంబంధోఽపి, ...

**అనువాదము:-** (ఈ ఖండిక పెద్దగా ఉన్నది. అందుచే సూక్ష్మ ఖండములుగా విభజించి వ్రాయుచున్నాను. వీటన్నిటిలోను భగవానుని అభయ ప్రధానమే వర్ణింపబడినది. అభయమిచ్చునపుడు స్వామి తన భక్తునిలో ఉన్న దోషములు వర్ణింపబడినవి. అట్టి దోషయుక్తుడైనను నాభక్తునకు అభయ మిచ్చుచున్నానని చివరతో సంబంధము.)

శ్రీరంగనాథస్వామి ఉడయవరులకు ఇట్లు అభయప్రదానము చేయుచున్నారు-

హే ఉడయవరే! రామానుజా! నాకైంకర్యమును అనవరతము చేయు అపేక్ష ఉన్నట్లు చెప్పుచున్నావు, మంచిదే. ఇట్టి అపేక్షవలననే నీవు సమస్త వస్తువులను త్యాగము చేసినావు. అట్లు త్యాగము చేసిన వాడనైనను, అనంతమైన ఆ యా వస్తువుల పాపముల ద్వారా ఆక్రమింపబడినవాడనైనను, అనగా అనంత పాపాక్రాంతుడ వైనను, అనంతమైన అపచారములను నా

విషయమైగాని, నా భక్తుల విషయమైగాని, (భగవదపచార, భాగవతాప చారములను) చేసిన వాడవైనను, అనంతా సహ్యాపచారములను చేసిన వాడనైనను, (భాగవత ఆచార్యాపరాధములు అసహ్యాచారములు అనబడును), ఇట్లు అనంతాపచారములు చేయుటకు కార్య కారణభూతములైన అహంకారము, మమకారము, మౌఢ్యము ( ఏమియు తెలియక మూఢముగా ప్రవర్తించుట) మొదలైన స్వభావములు కలవాడనైనను, ఈ విధమైన అనాదికాలము నుండి వచ్చుచున్న కార్యకారణభూత వాసనా సంబంధము కలవాడనైనను, ..... (వాటినన్నిటిని క్షమించి నాకు కైంకర్యము చేయదలచు నీ అపేక్షను సఫలము చేయుచున్నాను... అని ఖండిక చివరతో సంబంధం.

**30. మూలము:-** ఏతదనుగుణ ప్రకృతి విశేష సమృద్ధోఽపి, ఏతన్మూల ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవిక సుఖదుఃఖ తద్ధేతు తదితరోపేక్షణీయ విషయానుభావ జ్ఞాన సంకోచరూపమచ్చరణారవిందయుగలైకాంతి కాత్యంతిక పరభక్తి పరజ్ఞాన పరమభక్త విఘ్నప్రతిహతోఽపి,.....

**అనువాదము:-** అనాది కాలము నుండి వాసనా సంబంధము కలవాడనైనను, దీనికి తగిన ప్రకృతి విశేషములచే సమృద్ధుడవైనను, అనగా ప్రాకృతిక విషయ వాంఛలయందు ప్రవృత్తుడవైయున్నను, వీటికి మూలమైన ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక సుఖదుఃఖములు కలవాడవైనను, వీటికి కారణమైన వైననూ భిన్నమైన అనేక అపేక్షణీయ విషయానుభవములు కలవాడవైనను, ఈ విషయానుభవములచే నీజ్ఞానము సంకోచించినను, నాచరణారవింద యుగళమునే సేవించవలయుననెడి అత్యంత ఏకాంతిక భక్తి భావమునకు విఘ్నరూపమునైనవాటిచే బాధింపబడు పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తి అనునవి కలవాడనైనను, అనగా ఇది అనేక విఘ్నములే బాధింపబడుచున్నను, భగవత్‌చరణారవిందయుగళసేవకు అనేక విఘ్నదోషములు కలవాడవైనను,...

**31. మూలము:-** యేనకేనాపి ప్రకారేణ ద్వయవక్తాత్వం, కేవలం మదీయయైవ దయయా, నిశ్శేషవినష్టహేతుక మచ్చరణా

విరందయుగలైకాంతిక అత్యంతిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తి విఘ్నం, మత్ ప్రసాద లబ్ధ మచ్చరణారవిందయుగలైకాంతికాత్యంతిక పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తిః (భక్తయః) మత్ప్రసాదాదేవ సాక్షాత్కృత యధావస్థిత మత్స్వరూప గుణవిభూతి లీలోపకరణ విస్తారః .......

**అనువాదము:–** విఘ్నరూపములు అనేకములు కలవాడనైనను, ఏదో విధముగా, అనగా ఏ ప్రకారముగానైనను, ద్వయమంత్రోచ్చారణము చేయు నీవు (అనగా అనుష్ఠాన పూర్వకముగా ద్వయమంత్రోచ్చారణము చేయవలసిన అవసరము లేదు. ఏదోవిధముగా ద్వయమును ఉచ్చరించిన చాలును. అనిఅర్థము) నిశ్శేషముగా నీ కర్మలన్నిటిని పోగొట్టుకొంటివి. అట్లుపోగొట్టు నాయొక్క చరణారవింద యుగళముపై నీకు గల పరభక్తి పరజ్ఞాన పరమభక్తి అనువానికి కలుగు విఘ్నములను కేవలము నేనే తొలగింతును. నా దయవలననే ఆవిఘ్నములు తొలగును. నాదయవలననే నీకు పరభక్తి పరజ్ఞాన పరమభక్తులు కలుగును. నాఅనుగ్రహమువలననే నీకు నాయొక్క యధావస్థితి గుణములు, (నాకుగల గుణములు ఉన్నవి ఉన్నట్లు), విభూతులు (లీలావిభూతి, నిత్యవిభూతి, అనునవి.) ఈ ఉభయ విభూతులకు విస్తార ఉపకరణములు అయిన వాటిని నీవు దర్శించ గలవు,.....

**32. మూలము:–** అపరోక్ష సిద్ధ మన్నియాన్యతయా మద్దాస్యైక స్వభావాత్మ స్వరూపః, మద్దాస్యైకప్రియః పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్య ప్రయోజన అనవధికాతిశయ ప్రియమదనుభవస్త్వం, తధావిధ మదను భవజనిత అనవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైవరతిరూప నిత్యకింకరోభవ"

**అనువాదము:–** నేను, అపరోక్షముగానే నియమన స్వభావము కలవాడను. అనగా ప్రత్యక్షముగానే జగన్నియమనమును చేయుచున్న వాడను. నీవు నాదాస్యమునే ప్రధానముగా కోరు స్వభావము కల వాడవు. నా దాస్యమునే ఎంతో ప్రియముగా భావించుచుండువాడవు. నీ ఈ ప్రియభావన

అనవరతమైనది. అనగా ఎల్లప్పుడు ఉండునది. సంపూర్ణమైనది, నిత్యమైనది. ఎంతో విశదతమమైనది. అనగా స్పష్టమైనది. వివిధమైన లోపములేనిది. ఇతర ప్రయోజనము ఏమాత్రము లేనిది. అట్టి ప్రియాతిప్రియమైన భావముతో నన్ను అనుభవించవలయునని కోరుచున్నావు. ఇటువంటి నా అనుభవము వలన కలిగిన, అశేషమైన ప్రీతిచేత, సర్వకాల సర్వావస్థలయందు. అశేషమైన శేషత్వభావనతో, నిత్యము నాకు సేవచేయుచు, కైంకర్యము చేయుచు ఉండుము.

-- (ఇప్పటికి ఈ పెద్దఖండిక పూర్తి అయినది. ఖండికాంతర్గత ఖండములు 4 వచ్చినవి. ఇలా విభజించినాను.)

**33. మూలము:-** ఏవం భూతోఽపి, ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవిక దుఃఖ విఘ్నరహితస్త్వం, అత్రైవ శ్రీరంగే, సుఖమాస్వ॥

**అనువాదము:-** (ఈ ఖండికలో, శ్రీరంగములోనే నివసించుమని ఉడయవరులకు శ్రీరంగనాథుడు ఆదేశమునిచ్చుచున్నారు).

ఇట్లు అనవరతము నాకు కైంకర్యము చేయుచుండదలచువాడనైనను, ఆధ్యాత్మిక, ఆధిబౌతిక, ఆధిదైవిక దుఃఖములు నీకు కలుగకపోయినను, వాటివలన కలుగు విఘ్నములచే రహితుడవైనను, నీవు ద్వయమును అర్ధసహితముగా ఎల్లప్పుడు అనుసంధించుచుండుము. అట్లు అనుసింధించుచు, నీ శరీరావసాన సమయమువరకు, నీవు ఇచ్చటనే శ్రీరంగములోనే సుఖముగా నివసించుము.

**34. మూలము:-** శరీరపాత సమయేతు, కేవలం మదీయయైవ దయయా అతిప్రబుద్ధః మమేవావలోకయన్, అప్రచ్యుత సంస్కార మనోరథః జీర్ణమివ వస్త్రం సుఖేన ఇమాం ప్రకృతిం, స్థూల సూక్ష్మరూపాం విసృజ్య, తదానీ మేవ తత్ప్రసాదలబ్ధ మచ్చరణారవింద యుగలైకాంతికాత్యంతిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తికృత పరిపూర్ణానవరత నిత్యవిశదతమానన్య

ప్రయోజనానవధికాతిశయ ప్రియమదనుభవజనిత అనవధికాతిశయ ప్రీతికారితా శేషావస్థోచిత అశేష శేషతైకరతిరూప నిత్యకింకరో భవిష్యసి –

**అనువాదము:–** (ఈ ఖండికలో "నిత్యకింకరుడవుకమ్మ" అనేది స్వామివారి అభయప్రదానము వర్ణింపబడినది)

శరీరమును నీవు త్యాగము చేయుసమయములో, కేవలము నాయొక్క దయవలనే ప్రబుద్ధుడవై (అంత్యకాలస్మృతి కలవాడవై) నన్నే దర్శించుచు, భిన్నముకాని (ఏ మాత్రముచెదరని) సంస్కారమనోరథుడవై, జీర్ణమైన వస్త్రమును తొలగించుకొనునట్లు, ఈ ప్రకృతిమండలములో నీకు గల స్థూలరూపమును, సూక్ష్మరూపమును (ఈ లోకములోగల శరీరరూపమును స్థూలరూపమనియు, ప్రాణత్యాగము పిదప లభించు యాతనాశరీరమును సూక్ష్మశరీరమనియు వ్యవహరింతురు. ఈ రెండు విధములైన రూపములను త్యాగము చేసిన పిదపనే జీవుడు "ముక్తపురుషుడు అగును)––

ఈ రెండు విధములైన రూపములను విడచివైతువు. ఈ స్థూల, సూక్ష్మరూపములను విడచిన మరుక్షణముననే, నా అనుగ్రహముచేత, నాచరణారవిందములపై నిత్య నిరవద్య నిరతిశయ ఏకాంతికాత్యంతిక పరభక్తి, పరజ్ఞాన పరమ భక్తులచే కలిగిన పరిపూర్ణప్రీతి చేత నాఅనుభవ జ్ఞానము నీకు కలుగును. అట్లు కలిగిన భగవదనుభవముచే (నా అనుభవము చేత) సర్వకాల సర్వావస్థలయందు కైంకర్యమే చేయుచుండవలయునని ప్రీతికలుగును. అట్టి ప్రీతిచే నీవు నిత్యకింకరుడవు కాగలవు–– అని శ్రీరంగనాథస్వామి ఉడయవరులకు ఆదేశమిచ్చినారు.

**35. మూలము:–** (i) "మా తే భూదత్రసంశయః"

**అనువాదము:–** (ఈ ఖండికలలో స్వామి తన సత్యవాక్పరతను సాయించుచున్నారు) నేను చెప్పిన ఈ విషయములలో సందేహము అవసరమేలేదు. సందేహింపకుడు.

**36. మూలము:–** (ii) "అనృతం నోక్త పూర్వంమే, నచ వక్ష్యేకదాచన"

**అనువాదము:–** నాచే అసత్యము ఎప్పుడూ వక్కాణింపబడదు. ఇక ఎప్పుడు కూడ అసత్యము పలుకను–

**37. మూలము:–** (iii) "రామో ద్విర్నాభి భాషతే"

**అనువాదము:–** రాముడు రెండవమాట మాట్లాడనే మాట్లాడడు. ఒకే వాక్యము పలుకును –

**38 మూలము:–**

(i) **శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే,**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతత్వ్రతం మమ॥**
**ఇతి మయైవ హ్యుక్తమ్ –**

**అనువాదము:–** (ఈ రెండుఖండికల శ్లోకములలో స్వామివారి అభయ ప్రదానశీలత్వము మరియ ఆశ్వాసనము వర్ణింపబడినది. తన ప్రతిజ్ఞా క్రమమును గుర్తుచేయచున్నారు).

రామానుజా! ఈ సర్వభూతములలో, ప్రాణికోటిలో, ఏ ప్రాణికాని, ఒక్కసారి "నేను నీవాడనే స్వామీ!" అని అర్థించినచో నేనువారికి అభయమిచ్చెదను. వారు ఎట్టివారని ఆలోచించను. ఇది నావ్రతమే. నా ప్రతిజ్ఞయే –

**39. మూలము:–**

(ii) **శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణంవ్రజ ।**
**అహంత్వా సర్వపాపేభ్యో, మోక్షష్యామి మాశుచః ॥**
**ఇతి మయైవ హ్యుక్తమ్–**

**అనువాదము:–** అన్ని ధర్మములను విడచిపెట్టి, నన్నే శరణువేడుము, నేను నిన్నుసర్వపాపములనుండి విముక్తుని చేయుదును. దుఃఖింపకుము–

– అని నేనే చెప్పితిని కదా. ఇంకనీకు సందేహమెందులకు?

కాబట్టి నీవు తత్త్వము తెలుసుకొనిన జ్ఞానము కలవాడవై నా దర్శనమును పొందుటలో, నన్నుపొందుటలో ఎట్టి సంశయమును కలిగియుండకుము. సుఖముగా ఉండును.

**40. మూలము:–**

**శ్లో॥ అంత్యకాలే స్మృతిర్యాతు, తవ కైంకర్యకారితా ।**
**తామేనాం భగవన్నద్య క్రియమాణం కురుష్వమే ॥**

ఇతి శ్రీ భగవద్రామానుజ విరచితే గద్యత్రయ ప్రబంధే శరణాగతి గద్యమ్.

**అనువాదము:–** (ఈ ఖండికలో, ఈ శ్లోకరూప ఖండికలో, శ్రీభగవద్రామానుజులు స్వామివారిని ప్రార్థించుచున్నారు)

హే భగవాన్, హే శ్రీరంగనాథా, నీ కైంకర్యము చేయవలయుననెడి స్మృతి, నా అంత్యకాలమున ఉండవలయునని, ఆ స్మృతివలన నేను నాయొక్క అంత్యకాలమున నిన్నే స్మరించునట్లు నన్ను అనుగ్రహించుము స్వామీ! అని శ్రీ భగవద్రామానుజులు శ్రీరంగనాథుని ప్రార్థించుచు శరణాగతిగద్యను ముగించుచున్నారు.

*ఇది శ్రీభగవద్రామానుజులచే విరచితమైన గద్యత్రయ ప్రబంధము నందలి "శరణాగతి గద్యము".*

* * * * *

## ప్రార్థనా నిగమన శ్రుతిః

**శ్లో॥ లక్ష్మీ పతే ర్యతి పతేశ్చ దయైక ధామ్నోః**
**యోఽసౌ పురా సమజనిష్ట జనిష్ట జగద్ధితార్థం,**
**ప్రాప్యం ప్రకాశయతునః పరమం రహస్యం**
**సంవాద ఏష శరణాగతి మంత్రసారః ॥**

ఇది శరణాగతి మంత్రసారము. భగవానుడైన శ్రీమన్నారాయణుని దయతో, యతిపతిమైన శ్రీమద్రామానుజులు జగత్తుల యొక్క హితమును కోరి ఇట్లు ఈ శరణాగతిమంత్రసారమును కృపచేసినారు. శ్రియఃపతి మరియు యతిపతి వీరిద్దరును దయైకధామ్నులే, దయాశీలురే. పరమ రహస్యమైన ఈ శరణాగతి మంత్రసారమును (గద్యత్రయమును) మనమువారికృపచే పొందగలిగినాము, పొందినాము. ఈ శరణాగతి మంత్రసారము భగవానునకు, జీవునకు మధ్య జరిగిన సంభాషణ రూపములో ఉన్నది కదా! ఇది ఎంతో హృదయంగమము – స్పష్టము. ఈ సంభాషణము భగవానునకును, మనకును మధ్య జరిగిన సంభాషణముగనే భావించుట యుక్తము. ఈ పరమ రహస్యమును ప్రతివారు తెలుసుకొనవలయును.

దీనిని అనుసరించి భగవానునకు శరణాగతి చేసి, మనమందరము ఆత్మోజ్జీవితులము అగుదుము గాక.

***ఇతి శ్రీభగవద్రామానుజ విరచితే గద్యత్రయ ప్రబంధే శ్రీవైకుంఠగద్యమ్***

* * * * *